


కృష్ణమూర్తి సెక్షన్‌లో నుంచి బైట పడేసరికి చీకటి పడింది.

'అప్పుడే చీకటి పడిందే!' అనుకున్నాడు వాచీ చూసుకుంటూ.

టైము అరున్నరయింది.

"చలికాలం కదండీ! రాత్రి పొద్దెక్కువ." అన్నాడు కంట్రాక్టర్ జగన్నాధం.

"మీ బిల్లు పాసయినట్టేగా?"

"ఆఁ అదే చెప్పడానికొచ్చాను. థాంక్స్!"

"నో మెన్షన్!"

జగన్నాధం తన జేబులో నుంచి ఒక కవరు తీసి కృష్ణమూర్తికి అందించి, మరొకసారి థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు.

చీకటి తెరలను కదిలిస్తూ, చల్లగా వీస్తోంది గాలి.

చీకటి చెరువులో ప్రతిబింబిస్తున్న చుక్కల్లా వెలుగుతున్నాయి స్ట్రీట్ లైట్లు.

గాజు చెరువులో ఈదుతున్న రంగు రంగుల చేపల్లా జనం హడావుడిగా పోతున్నారు రోడ్ల మీద.

కృష్ణమూర్తి ఉడిపీ హోటల్ కెళ్ళి, 'టీ'కి ఆర్డర్ ఇచ్చాడు.

ఎర్రటి వులెన్ స్వెటర్ అతని ప్రక్కన కూర్చున్న సుందర యువతిని చూసి అతని కళ్ళు రెప్పలు వేయడం మానేశాయి. 'ఎవరో అతను అదృష్టవంతుడు' అని గొణుక్కున్నాడు.

ఆ యువతి అచ్చు రోజాలా వుంది. కోటేరులాంటి ముక్కు, గులాబీ మొగ్గల్లాంటి పెదవులు, నల్లటి వంకీల జుట్టు, సన్నగా మల్లె తీగెలా వుంది.

ఆమె చెవి దుద్దులు డేంజర్ లైట్‌లా ఎర్రగా వెలుగుతున్నాయి.

అప్పుడప్పుడూ ఆమె నోట్లో నాలుక పాము నాలుకలా ఆడుతోంది.

ఆమె హేండ్‌బ్యాగ్ సర్దుకున్నప్పుడు, మోచేతుల ప్రక్కన తొలగిన పైటలో 'బ్రా'లో బిగించిన ఎత్తైన వక్షోజాలు చూసి కృష్ణమూర్తి మనసు వికలమైపోయింది.

అప్పటికప్పుడు నిర్ణయించుకున్నాడు, ఆ రాత్రికి రోజాతో గడపాలని.

గబగబా అడుగులు వేసుకుంటూ రూమ్‌కి వెళ్ళాడు. తలుపులు తీసేటప్పటికి, ఇన్‌లాండ్ లెటర్ పడి వుంది. అది కృష్ణమూర్తి తండ్రి రాశాడు. అతని పెళ్ళి గురించే! నాలుగైదు సంబంధాల గురించి, ఎవరెంత కట్నం ఇస్తారన్నదీ వివరాలు వెల్లడించారు. సంక్రాంతికి పది రోజులు వుండేటట్లుగా వూరికి వస్తే, పిల్లల్ని చూచి ఏదో ఒకటి సెటిల్ చేస్తాననీ, పెళ్ళి శ్రావణంలో జరిపిస్తాననీ వుంది.

అది చదివి, దాన్ని గూట్లోకి విసిరేశాడు. అతనికి తండ్రిమీద కోపం ముంచుకొచ్చింది.

ఈ జన్మలో ఏ సంబంధం కుదరదు' అని గొణుక్కున్నాడు బట్టలు మార్చుకుంటూ.

కృష్ణమూర్తి సూపర్వైజర్‌గా వుద్యోగంలో చేరి ఆరేళ్ళు దాటింది. జీతం వెయ్యి పైన వస్తుంది. అతనికిప్పుడు ఇరవై ఎనిమిదేళ్ళు. వాళ్ళనాన్న మాత్రం మా వాడికి పాతికేళ్ళింకా రాలేదని చెప్తూంటాడు. ఆయన టార్గెట్ ఏభై వేలు. అందుచేత కన్యాదాతల్ని వెతుకుతున్నాడు. ఆయనకినమ్మకం వుంది. ఎప్పటికైనా తన కొడుక్కి అంత కట్నం యిచ్చే సంబంధం కుదురుతుందని.

ఇక్కడ కృష్ణమూర్తి హోటళ్ళలో చప్పిడి మెతుకులు తిన లేకుండా ఒక చావు చస్తున్నాడు. మరొక చావు ఆడతోడు లేక పోవడం. వయస్సులో ఒంటరిగా వుండడం (అదీ రాత్రిళ్ళు) కంటే మనిషికి వేరే శిక్ష లేదని అతనికి అనుభవపూర్వకంగా తెలిసింది. కోరికలు పాముల్లా కదుల్తుంటే తట్టుకోలేక డబ్బిచ్చి సుఖం కొనుక్కోవడానికి అలవాటు పడ్డాడు.

అక్కడా సుఖం లేదు. పోలీసులు ఎక్కడ రైడ్ చేస్తారో నని భయంగా వుంటుంది.

తండ్రి పిసినారి తనానికి వళ్ళు మండి 'ఎవరికీ చెప్పా చెయ్యకుండా ఎవర్నో ఒకర్ని గప్‌చిప్‌గా రిజిష్టర్ మ్యారేజ్ చేసుకుంటేసరి, అప్పు డాయన తిక్క కుదురుతుంది' అను కుంటూ వుంటాడు.

ట్రిమ్ముగా టాయిలెట్ చేసు కుని రూమ్‌కి తాళం వేసి బయల్దేరే సరికి ఏడు దాటింది. పార్కులో జనం మూగివుంటే ఏమిటో చూద్దా మని వెళ్ళాడు.

స్టేజీమీద ఒక ఖద్దరు బట్ట లాయన వుపన్యాసం ఇస్తున్నాడు. వరకట్న దురాచారం గురించి, దానివల్ల ఆడపిల్లల తండ్రులు ఎంత ఘోరంగా బాధపడుతున్నదీ, కట్నం తక్కువైందని కోడళ్ళని అత్తమామలు హింసించడం, కాల్చి చంపడం కథగా, పిట్ట కథలతోసహా మనోరంజకంగా చెప్పాడు. మధ్య మధ్య చప్పట్లు టపాకాయల్లా పేలిపోతున్నాయి.

ఆయన కూర్చున్నాక, ఒక కాషాయ బట్టలాయన లేచాడు. ఈయన సబ్జెక్టు వ్యభిచారం కాబోలు. దానిమీద అందు కున్నాడు. ఆయన గొంతు గుడిలో

గంటలా ఖంగు ఖంగున మ్రోగుతూ వుంది.

"వ్యభిచారం ఘోర వ్యసనం. అది మానవ జాతి పతనానికి హేతువు. మానవ సంస్కృతిని విచ్ఛిన్నంచేస్తున్నది. దీనికి కారణం స్త్రీలు అని, వాళ్ళని ముద్దాయిలుగా కోర్టులో నిలబెడుతున్నది సంఘం. కాని, అది తప్పని నేను మనవి చేస్తున్నాను. పురుషుల విషయ లోలత్వమే ఇందుకు కారణం. ఆడదాని శరీరం డబ్బిచ్చి కొనడం ఎంత నీచం? ఇదెక్కడి న్యాయం? మానవధర్మం అదేనా?"

ఆడవాళ్ళు కొన్ని నిమిషాలు ఆగకుండా కొట్టారు చప్పట్లు.

"స్త్రీ అంటే ఎవరు? మన తల్లి, మన సోదరి, మన కూతురు. అటువంటి స్త్రీకి ద్రోహం చెయ్యడం పురుష ప్రపంచానికే కళంకం."

ఆడవాళ్ళ చప్పట్లు.

"తాగుడు, జూదం, వ్యభిచారాలకు అలవాటు పడినవాళ్ళు మనిషి ధర్మాన్ని విస్మరించారని నేను భావిస్తున్నాను. దేవుడు జన్మ యిచ్చింది కర్తవ్యం నిర్వర్తించడానికి. ఒకవైపు కోటాను కోట్ల సోదరులు తిండిలేక, గుడ్డలేక, గూడు లేక అలమటిస్తుంటే కొందరు వారికోసం పాటుపడవలసిందిపోయి, వ్యసనాలకు దాసులై పోవడం ఘోరం! పాపం!

"అయ్యో! ఈ వ్యభిచారం అనేది ఒక పుండులా పుట్టింది. దీనికి మందువేసి, డ్రస్‌చేసి మాన్పించాల్సిన బాధ్యత ముఖ్యంగా యువకులందరి మీదా వుంది.

"యువకుల్లారా! అసహాయులైన పతితలను చూసి జాలిపడండి. వాళ్ళను ఉద్ధరించండి. ఒక పతితను పెళ్ళి చేసుకుని, ఆమె జీవితానికి వెలుగు ప్రసాదిస్తే దేవుడు మెచ్చుతాడు. మానవసేవే మాధవసేవ అని మర్చిపోవద్దు."

ఆ వుపన్యాసం వినేసరికి కృష్ణమూర్తి బుర్ర గిర్రున తిరిగినట్లయింది. మనసులో రకరకాల ఆలోచనలు కుమ్మరి పురుగులా తొలుస్తున్నాయి.

పార్కులో నుంచి బైట పడ్డాడు.

కాళ్ళు యాంత్రికంగా రోజా కోసం అడుగులు వేస్తున్నాయి.

* * *

కృష్ణమూర్తి అక్కడికి వెళ్ళేసరికి దుర్గమ్మ, రోజా జుట్టు పట్టుకుని వంగదీసి, ఢభీ ఢభీ గుద్దుతున్న దృశ్యం కంట పడింది. అతన్ని చూసి కొట్టడం ఆపి,

బూతులు తిట్టడం సాగించింది.

"ఏయ్, దుర్గమ్మా! ఏం పని అది? ఎందుకు కొడుతున్నావ్?" అన్నాడు గట్టిగానే.

అతనికి కోపం ముంచుకొచ్చింది దుర్గమ్మమీద. వాళ్ళని అడ్డం పెట్టుకుని డబ్బు సంపాదిస్తూ, పైగా అధికారం చలాయిస్తూ, హింసిస్తుంది రాక్షసి.

"కృష్ణబాబూ!.....నువ్వా! రా.. బాబూ!" అంది ఏమీ ఎరగని దానిలా.

"ఏమిటా ఛండాలపు పని?" విసుగ్గా అన్నాడు.

"చూడు బాబూ! అది నాకు చెప్పకుండా సుబ్బయ్య కొట్లో వందరూపాయల చీర తెచ్చుకుంది. వాడొచ్చి నానా యాగీ చేసి పోయాడు. ఎక్కడ్నుంచి తీసుకు రాను డబ్బు? అందరికీ డబ్బే కావాలి. పోలీసు సచ్చినోళ్ళకి, రౌడీ నా కొడుకులకీ దోచిపెట్టలేక చస్తున్నాను."

"చాల్లే! ఆపు నీ దండకం. నీ తాతమూట యిస్తున్నట్లు ఏడుస్తున్నావే! వాళ్ళుసంపాదించేదేగా?" అని కోపంగా జేబులో నుంచి వంద కాగితం తీసి, దుర్గమ్మ మొఖంమీద కొట్టి, గదిలోకి వెళ్ళి పోయాడు చొరవగా.

రోజా వచ్చి ఫ్యాన్ వేసింది.

ఆమెవైపు జాలిగా చూశాడు.

సన్నగా సన్నజాజి తీగెలా సుకుమారంగా వుంది రోజా. చిలిపి కళ్ళతో, ఎత్తైన గుండెలు, దానిమ్మ పళ్ళ వరుస, నిమ్మపండు రంగులో నీలం చీర కట్టుకుని అమాయకంగా ముగ్ధ మనోహరంగా వుంది రోజా. అంతకు ముందు ఏమీ జరగనట్లే ప్రశాంతంగా వుంది ఆమె ముఖం.

"చలి పుడుతోంది ఫ్యాన్ ఆపు" అన్నాడు.

"వేడిమీదున్నారు గదా అందు కని." నవ్వింది రోజా.

"అది నిన్ను కొడుతుంటే నాకు కోపం వచ్చింది" అన్నాడు.

"నామీద అంత ప్రేమా?" చిలిపిగా నవ్వింది, అతని జుట్టులోకి వేళ్ళు పోనిస్తూ.

"అవును రోజా! నువ్వు నమ్మవుగాని, నేను యిక్కడ మరెవరిదగ్గరికైనా వెళ్ళగా నువ్వు చూశావా?" అన్నాడు.

రోజా మాట్లాడలేదు. మంచం మీద కూర్చుని అతని వొడిలోకి వాలిపోయింది సుతారంగా.

"రోజా!"

"వూఁ....."

"నువ్వు ఈ నరకంలో వుంటే

చివరకు ఏమైపోతావు? రోగాలతో, రొష్టులతో కుళ్ళి కుళ్ళి ఏ రోడ్డు ప్రక్కనో, మురికి కాలువ ప్రక్కనో చస్తావు. అదంతా ఆలోచించుకున్నావా?"

కృష్ణమూర్తి మనసులో ఆ కాషాయ బట్టలాయన వుపన్యాసం మెదుల్తోంది.

"ఆలోచించుకుంటూ వుంటే ఏ పనీ చెయ్యలేం. కడుపు నిండడానికి ఇందులో వుండక చేసేదేముంది?" అంది రోజా విరక్తిగా

"నిరాశపడకు రోజా! జీవితం మన చేతిలో వుంది. ఎలా బడితే అలా చక్కదిద్దుకోవచ్చు. బ్రతకడానికి అనేక మార్గాలున్నాయి."

"వున్నాయి నిజమే! కాని చూపించేదెవరు?"

"నేను" అన్నాడు సిగరెట్ ముట్టిస్తూ.

రోజా నివ్వెరపోతూ "మీరా?" అంది.

"అవును. నేనే రోజా! నువ్వంటే నాకెంతో యిష్టం. ఇక్కడ నీ బ్రతుకు ఎంత దుర్భరంగా వుందో, చూస్తుంటే నాకు ఎంతో బాధగా వుంది. నిన్నెలాగైనా ఈ మురికి కూపంలోనుంచి బైటికి తీసికెళ్తాను."

"తీసికెళ్ళి?"

"నిన్ను పెళ్ళి చేసుకుంటాను" అన్నాడు.

ఆమె నమ్మలేనట్లుగా చూసింది.

"చాల్లెండి సరసాలు! ఇంతకీ భోజనం చేసి వచ్చారా? లేదా! పైత్యం చేసిందేమో? వింతగా మాట్లాడుతున్నారు" అంది రోజా నవ్వుతూ.

కృష్ణమూర్తి జేబులో డబ్బు తీసి ఆమెకు అందిస్తూ, "విస్కీ క్వార్టర్ తెప్పించు. జీడి పప్పు కూడా" అన్నాడు.

ఆమె కుర్రాడిని పంపి వచ్చింది.

"ఎగతాళి కాదు" అన్నాడు.

"నిజమే?" అని మళ్ళీ నవ్వింది.

"నిజమే రోజా! ఒక పతితను వుద్ధరిస్తే దేవుడు మెచ్చుతాడని ఒక స్వాములవారు చెప్పారు. అలాగే చెయ్యదల్చుకున్నాను."

"అదెంత కష్టమో తెలుసా?"

"డబ్బుంటే ఏదీ కష్టం కాదు రోజా! డబ్బున్న వాడికి ఈ లోకం దాసోహం. నెల నెలా కొన్ని వేలు సంపాదిస్తున్నాను. నన్నెవరూ ఏమీ చెయ్యలేరు" అన్నాడు.

రోజా ఆలోచనలో మునిగినట్లు కన్పించింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?

దుర్గమ్మ గురించా! అది ఒప్పుకో దనా?" అన్నాడు.

"ఎందుకొప్పుకోదు? దానికివ్వాల్సిన డబ్బు మొఖానపారేస్తే నోరు మూసుకుంటుంది" అంది రోజా.

విస్కీ గొంతులోకి పోయిన తర్వాత కృష్ణమూర్తి సంకల్పం దృఢమైంది. ఆ రాత్రికే రోజాని తన రూమ్‌కి తీసికెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాడు.

* * *

కృష్ణమూర్తి తాళం తీసి తలుపు నెట్టి లైటు వేశాడు.

"రా రోజా! ఇదే మన ఇల్లు రెండు గదులున్నాయి. ఒక్కడినే గదా అని దీంతో సరిపెట్టుకుంటున్నాను. తర్వాత పెద్ద ఇల్లు తీసుకొందాం" అన్నాడు.

రోజా గదిలోకి అడుగు పెట్టింది. ఆమెకు గాలిలో తేలిపోతున్నట్లుగా వుంది. ఇదంతా నిజమా? లేక కలా! అన్నట్లుగా వుందామెకు. కష్టాలు కల కాలం కాపురం చెయ్యవు అంటారు ఇదేనేమో అనుకుంది.

ఆమె అతన్ని చూసింది ఓరగా. ఆమె చూపుల్లో కృతజ్ఞత నిండి వుంది. మోడువారిన జీవితానికి వసంత శోభ వచ్చింది. ఆమెకు తనవాడంటూ ఒకతోడు దొరికాడు. భయం...భయం. బ్రతుకు లేదిక. దుర్గమ్మతో తన్నులు, తిట్లులేవు. లాడ్జిలో డబ్బుకోసం గడిపే పని లేదిక. తనను ప్రేమించే వాడొకడున్నాడనే భావం, ఎంతో తృప్తి కలిగించింది ఆమెకు. ఆమె హృదయం పున్నమినాటి సముద్రంలా వుప్పొంగి పోతూవుంది.

"క్యారేజీతో భోజనం పట్టుకొస్తాను" అని అతను క్యారేజీ పట్టుకొని వెళ్ళాడు.

ఆమె గదంతా శుభ్రం చెయ్యడానికి పూనుకుంది.

అరగంట తర్వాత వచ్చాడు కృష్ణమూర్తి. అతనితోపాటు మరొక యువకుడు గూడా లోపల కొచ్చాడు. కృష్ణమూర్తి చేతిలో క్యారేజీతోపాటు పెద్ద ప్యాకెట్ కూడా వుంది. అతనిచేతిలో సూట్‌కేస్ వుంది.

"బయట మంచు కురుస్తోంది. చలిగాలి అదరగొట్టేస్తోంది" అన్నాడు అతను.

"సంక్రాంతి దగ్గరకొచ్చింది గదా!" అన్నాడు కృష్ణమూర్తి.

"నీకోసం రెండుసార్లొచ్చాను. రూమ్‌లాక్ చేసి వుంది. హోటల్ కేపి వెళ్ళితే రాలేదన్నారు. ఫస్ట్ షోకి చెక్కేశావేమోనని అనుకున్నా" అన్నాడు అతను.

కృష్ణమూర్తి క్యారేజి రోజాకి అందించి, "నువ్వు కానివ్వు. నాకు ఆలశ్యం వుందిలే" అన్నాడు.

అతనితోపాటు కలిసి భోజనం చేయాలనుకున్న రోజాకి ఆశాభంగం కలిగింది.

ఇద్దరూ అవతల గదిలో కూర్చుని పొట్లాలు విప్పారు. అతను బాటిల్ తీసి టేబుల్ మీద పెడుతూ, "మిలటరీ సరుకు ఎన్నాళ్టికో దొరికింది" అన్నాడు.

"ఏరా మురళీ! ఏమిటి బెజవాడ కబుర్లు?" అన్నాడు కృష్ణమూర్తి.

"ఏమున్నాయి?"

"అదే కల్పన కేసు ఏమైంది?" అన్నాడు.

"మనం కేసు టేకప్ చేస్తే ఇన్నాళ్ళా? దాన్ని ఎప్పుడో లైన్ లో పెట్టాను. ఇప్పుడు కాలేజీ ఎగ్గొట్టి మనవెంట తిరుగుతోంది" అన్నాడు మురళి గర్వంగా.

"అసాధ్యుడివిరా నాయనా!" మెచ్చుకున్నాడు కృష్ణమూర్తి.

"మన పేరేమిటో తెలుసుగా! మురళి. మనం తల్చుకుంటే ఏ గోపికైనా వాళ్ళో వాలాల్సిందే."

"పేరులో ఏముంది నా బొంద? నా పేరూ అదేగా! ఒక్కతీ వచ్చి చావదు. మన జాతకం ఏమిటో గాని, కంపెనీల చుట్టూ తిరగాల్సిందే." విచారంగా అన్నాడు కృష్ణమూర్తి.

ఇద్దరూ గ్లాసులు ఖాళీ చేస్తూ, వింపుతూ అమ్మాయిల కబుర్లు చెప్పుకుంటూ ఆనందిస్తున్నారు.

రోజా భోజనం చేసి బెడ్ మీద పడుకుంది. ఆమెకు నిద్రరావడం లేదు. మురళి నవ్వు వినిపిస్తుంటే కంపరంగావుంది. అతని మాటలు అసహ్యం పుట్టిస్తున్నాయి. ప్రపంచంలో తానొక్కడే మొగాడు అన్నట్లు చెప్తుంటే పళ్ళురాలగొట్టాలనిపిస్తోంది. ఆమెకు కృష్ణమూర్తి మీద కోపం వచ్చింది. ఏమిటో ఆ అర్థంలేని తాగుడు అనుకుంది.

పొట్లాలు విప్పినట్లున్నారు. పలావ్ వాసన వస్తోంది. రోజా అసహనంగా దొర్లింది పక్కమీద. తొలిరాత్రే అసంతృప్తిగా గడవడం ఆమెకు బాధ కలిగించింది. బెడ్ లైట్ కూడా ఆర్పేసి నిద్రపోవడానికి వుపక్రమించింది.

అప్పటికి ఎంత రాత్రయిందో? కృష్ణమూర్తి మీద చేతులు వేస్తుంటే ఆమెకు మెలకువ వచ్చింది!

"ఇప్పటిదాకానా వెధవకబుర్లు" అంటూ ఆమె మెడచుట్టూ చేతులు వేసి అతన్ని ముద్దు పెట్టుకుంది.

"వాడిని గురించి అట్లా అనకు. వాడూ నేనూ ప్రాణ స్నేహితులం.

చిన్నప్పటి నుంచి ఒకటిగా పెరిగాం. ఒక్క కంచంలో తిని ఒక్క మంచంలో పడుకున్నాం. కంపెనీకి వెళ్ళినా ఒక్కదాంతోనే...." ముద్దు ముద్దుగా వస్తున్నాయి మాటలు.

"ఛీ....పాడుమాటలు." అంది రోజా నవ్వుతూ.

కృష్ణమూర్తి ఆవేశంతో ఆమె చీర లాగి మంచం క్రిందకు నెట్టాడు.

"ఏమిటిది పెళ్ళి కాకుండానే?" అని ఆమె పక పక నవ్వింది.

* * *

చల్లటి చెయ్యి జాకెట్టు హుక్స్ వూడదీస్తుంటే రోజాకి మెలకువ వచ్చి చూసింది. అతను కృష్ణమూర్తికాదు. భూతంలా కనిపిస్తున్నాడు. ఆమె ఒక్క వుదుటున లేచింది.

"ఎవరు?" అంది భయాందోళనలతో.

"నేనే...."

"ఎవరు నువ్వు?"

"మురళిని."

రోజా స్విచ్ వేసింది. వెలుగులో మురళి వికటంగా నవ్వుతున్నాడు. ప్రక్క గదిలో కృష్ణమూర్తి చాప మీద పడుకుని వుండడం ఆమెకు ఆశ్చర్యం కలిగించింది. మత్తుగా నిద్రపోతున్న అతను తనకు నిద్రా భంగం కలిగించినందుకు విసుగ్గా లేచి, "ఏమిటి రోజా?" అన్నాడు.

"చూడండి...."

"ఏమిటి పోలీసులొచ్చారా?" అన్నాడు కంగారుగా.

"ఇది దుర్గమ్మ కంపెనీకాదు పోలీసులు రావడానికి. ఇది మన ఇల్లు."

"అవును గదూ!"

"మీ ఫ్రెండ్... ఛా... ఇటువంటి వాడనుకోలేదు. నేను నిద్రపోతుంటే దున్నపోతులా వచ్చి మీద పడ్డాడండీ. వెధవని బైటికి గెంటి తలుపెయ్యండి" అంది.

కృష్ణమూర్తి లేచి కళ్ళు తెరచి రోజా వంక చూసి, "వాడు నాకు చెప్పే వచ్చాడులే. నేను పర్మిషన్ ఇచ్చాను. ఈ రోజుకు కానివ్వు. ఇందుకేనా ఏదో కొంపమునిగిపోతున్నట్లు నిద్రలేపావు?" అని గట్టిగా ఆవులించి పడుకున్నాడు.

అతని మాటలు వింటూనే రోజా వణికిపోయింది. గుండెలో అదురు పుట్టింది. ఖాళీ కడుపులో చెయ్యి పెట్టి దేవినట్లయింది. మలేరియా జ్వరం వచ్చినట్లు గజ గజలాడింది. మాటలు మర్చిపోయిన దానిలా నోరు తెరిచి చూస్తుండి పోయింది.

మురళి ఆమె రెండు భుజాలు

పట్టుకొని పైకి లేపి మంచంవైపు లాక్కుని పోతుంటే ఆమె విడి పించుకోవడానికి ప్రయత్నించింది.

"ఏమిటే తెగ నీల్గుతున్నావ్? వందమంది దగ్గర పడుకోగా లేంది నా ఒక్కడి దగ్గర పడుకుంటే ఏం పోతుందే? ఇవాళ ఏమీ ఎరగ నట్లు మహా పతివ్రతలా బెట్టుచేస్తు న్నావే? కావాలంటే డబ్బిస్తాను. నీ రేటు చెప్పు" అంటూ బూతులు తిట్టాడు మురళి.

అతని మాటలు ఒక్కొక్కటీ ఒక్కొక సూదిలా వచ్చి హృద యానికి తగులుతూవుంటే ఆమె విల విల లాడిపోయింది. కన్నీళ్ళు నిండి అంతా మసక మసకగా కన్పి స్తుంటే వెలుగులో గూడా గుడ్డి దానిలా అయిపోయింది. శరీరంలో శక్తి వుడికిపోయింది. నీరసం ముంచుకొచ్చింది. చేతులు, కాళ్ళు స్వాధీనం తప్పిపోతున్నాయి.

మురళి ఆమె వంటిమీద బట్టలు లాగేసి పశువులా ప్రవర్తిస్తుంటే ఆమె స్పృహ తప్పిన దానిలా పడి పోయింది.

అతడు వెళ్ళిపోయిన తర్వాత ఆమె శవంలా పడివుంది. ఎప్పుడు తెల్లవారిందో!

కృష్ణమూర్తి నిద్రలేపితే కళ్ళు తెరచి చూసింది. నీరసంగా లేచింది. అతనివంక చూడాలంటేనే అస హ్యంగా వుంది.

మురళి వున్న అలికిడి లేదు. వెళ్ళిపోయినట్లున్నాడు.

"లే! రోజా లేచి ముఖం కడుక్కో. నేను వెళ్ళి టిఫిన్, కాఫీ తెస్తాను" అన్నాడు కృష్ణ మూర్తి. రోజా మాట్లాడలేదు. ముభావంగా ఊరుకుంది.

"కోపం వచ్చిందా?" అంటూ ఆమె భుజం మీద చెయ్యివేసి నవ్వ డానికి విఫల ప్రయత్నం చేశాడు. ఆమె అతని చేతిని విసిరికొట్టింది.

"బాధపడకు. రేపటినుంచి అలా జరగనివ్వను."

అతని మాటలు పూర్తికాకుం డానే ఆమె లాగి చెంపమీద కొట్టింది. ఆ విసురుకు తూలి పడ బోయి నిలదొక్కుకున్నాడు అతి కష్టంమీద. కృష్ణమూర్తి విభ్రాంతి నుండి తేరుకుని చూశాడు.

ఆమె కళ్ళు నిప్పులు కురుస్తు న్నాయి.

"నన్ను కొట్టడానికి ఎంత ధైర్యమే నీకు? పిచ్చిగాని పట్టిందా?"

"నీకంటే ఎక్కువ ధైర్యమే వుందిరా నాకు, పిరికిదాన్నయితే రోజూ చస్తూ, బ్రతుకుతూ నీలాంటి వెధవలకు శరీరాన్ని అప్ప

గిస్తూ వుండేదాన్ని కాదు. పెళ్ళి చేసుకుంటానని నమ్మించి వాలో ఆశలు రేపి తీసుకొచ్చావు. కొన్ని గంటల్లోనే మారిపోయింది నీ బుద్ధి పరాయివాడి పక్కలో పడుకోబెట్టి పైగా బాధపడకు అని ఓదారుస్తున్నావా? ఛీ! ఛీ....నీలాంటి నీచుణ్ణి నమ్మినందుకు నాకు సిగ్గేస్తోంది. అంతేగాని నాకు బాధలేదు. వాడన్నట్లు కొన్ని వందలమంది నన్ను నలిపి, రక్కి, తొక్కి నాశనం చేశారు. ఎందరో ఘరానా పెద్దలు నన్నొక బాత్‌రూమ్‌గా వుపయోగించుకొన్నారు. అందులో ఆ మురళిగాడొకడు. నేను అందుకు బాధపడటం లేదు. నన్ను ఉద్ధరిస్తానని నీతులు చెప్పి మొసగాడిలా ఇంటికి తీసుకొచ్చి గోతిలో తోసినందుకు బాధపడుతున్నాను. నాకు ఇప్పుడర్థమయింది నన్నెందుకు తీసుకొచ్చావో? కాస్త తిండి పడేస్తే పడి వుంటుందని ఆలోచించావు. వాడి దగ్గరా, వీడి దగ్గరా తార్చి నీ అవసరాలు తీర్చుకోవచ్చని తీసు

## రచయితలకు మనవి

'విజయ'లో ప్రచురణార్థం పంపే కథలు, నవలలు, కార్టూన్స్, జోక్స్, వ్యాసాలు-ఏవైనా సరే ప్రచురణార్హం కాని వాటిని త్రిప్పి పంపగోరు వారు, తగినంత పోస్టేజీ అంటించిన కవర్లను జత చేయవలసిందిగా కోరుతున్నాం. అప్పుడే నిరాకరించిన వాటిని త్రిప్పి పంపటం జరుగుతుంది. ఆ తర్వాత ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ప్రయోజనముండదు. 'బాపు అభిమానుల పేజీ'లో పాల్గొనే పాఠకులు, తమ సంభాషణలను కార్డుమీద వ్రాసి పంపితే చాలు.

రచనలు పంపవలసిన చిరునామా :

ఎడిటర్,

'విజయ'

80-ధనలక్ష్మి కాలనీ,

మద్రాసు-600 026.

కొచ్చావు."

"ఏయ్ రోజా!" గట్టిగా అరిచాడు.

"నోర్మయ్ సిగ్గులేని వెధవా! నేనూ పెద్దగానే అరవగలను. నాకూ నోరుంది. రేపు నీకు పెళ్ళయ్యాక నీ పెళ్ళాన్ని అందరికీ తార్చి డబ్బు సంపాదించుకోరా!"

కృష్ణమూర్తి కోపం పట్టలేక కొట్టడానికి మీదకు పోయాడు.

"ఒంటి మీద చెయ్యి వేశావంటే, నీ పీక పిసికి చంపుతాను. దూరంగా వుండు."

"అంత గొప్పదానివా?"

"ఆగక్కడ. ఇప్పుడే నిన్ను జుట్టు పట్టుకొని బయటకీడ్చి నువ్వు చేసిన వెధవపని నలుగురికీ చెప్పి నీ ముఖం మీద వుమ్మేయిస్తాను జాగ్రత్త!"

బెదురుపుట్టి అతను ఆగిపోయాడు. 'దానికేమిటి సిగ్గులేని మనిషి. అన్నింటికీ తెగించిన బజారు ముండ. అన్నంత పనీచేస్తే వీధిలో తన పరువుపోతుంది' అనుకున్నాడు.

రోజాకి ఏడుపు ముంచుకొచ్చింది.

"ఇన్నాళ్టికి ఒక్కడైనా నన్ను మానవత్వం వున్న మనిషిగా గుర్తించాడని సంబరపడ్డాను. నేను కూడా చీమూ నెత్తురు వున్న మనిషినే. నేనూ నీలాగే అన్నం తింటున్నాను—గడ్డి తినడం లేదు. ఆ సంగతి మీరెవరూ గుర్తుంచుకోరు. మీ దృష్టిలో నేనొక మంచాన్ని, చాపని, ఒక సోఫాని, డబ్బుకోసం చెప్పినట్లల్లా ఆడే బొమ్మను మాత్రమే" అని రోజా వెక్కి వెక్కి ఏడ్చింది.

కృష్ణమూర్తి రోజావంక ఆశ్చర్యంగా చూస్తున్నాడు. ఆమె అనే మాటలన్నీ కొరడా దెబ్బల్లా తగులుతున్నాయి. ఆమెలో ఇన్ని ఆలోచనలు గూడు కట్టుకుని వున్నాయని అతను అనుకోలేదు.

"ఇక నీ ముఖం నాకు చూపించకు. అలా జరిగితే నేనేం చేస్తానో నాకే తెలియదు" అంటూ ఆమె విసురుగా వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిపోయిన కొంచెం సేపటికి వరకూ కృష్ణమూర్తి అచేతనంగా వుండిపోయాడు.

'నిన్న లేచి ఎవడి ముఖం చూశానోగాని వెరీ బాడ్ డే' అనుకున్నాడు.

అతనికి కాషాయబట్టలాయన జ్ఞాపకం వచ్చాడు. 'ఇదంతా ఆ మహానుభావుడి వలనే జరిగింది' అని గొణుక్కున్నాడు కృష్ణమూర్తి. ●